క్లుప్తంగా

పోరంకిలో అన్నసమారాధన



పెనమలూరు: పోరంకి శ్రీనగర్‌కాలనీలో కోదండరామాలయం ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమ పెద్ద ఎత్తున చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో సీతారామస్వామివార కల్యాణ మహోత్సవం చేశారు. భక్తుల కోసం ఆదివారం ఆలయంవద్ద ఉదయం 10 గంటలకు గోసాల కోటేశ్వరరావు భజన బృందంచే భగవన్నామ సంకీర్తన చేశారు. భక్తులు సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర మూర్తిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి, కమిటీ, భక్త బృందం భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు.

వృద్ధులకు చీరల పంపిణీ



గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని తల్లి వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన వృద్ధాశ్రమంలో మట్టల ఆదివారం సందర్భంగా దాతలు వృద్ధులకు వస్త్రదానం చేశారు. తొలుత దాత తిరివీధి రాంబాబు ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులు, వితంతువులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన కుమార్తె శ్రీనిధి సహస్ర చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. వృద్ధులు, వితంతువులకు తమవంతు సాయం అందజేస్తున్న దాతలకు వృద్ధాశ్రమ చైర్మన్ రాచేటి రూతమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగు పడి వరికుప్ప దగ్ధం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో పిడుగు పాటుకు వరి కుప్ప దగ్ధమైంది. ఆదివారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావటంతో తిప్పనగుంటలోని పంటపొలాల్లో పిడుగు పడింది. ఈ ఘటనలో దేవరపల్లి వసంతరావుకు చెందిన రెండు ఎకరాల వరికుప్పపై పిడుగుపడి వరికుప్ప దగ్ధమైంది. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపకదళం మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లుగా అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచానా వేశారు.

అలరించిన జానపద గీతాలాపన



విజయవాడ కల్చరల్: మాచవరం డౌన్ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు, బృంద సభ్యులు మీసాల రమణ, మధురానగరం మన్మథ, సందేనపల్లి సునీత, అవనిద్ద శీను తదితరులు పలు జానపద, భక్తి గీతాలను మధురంగా ఆలపించారు. శివ శివమూర్తివి గణనాథ, జగదభిరామ, తదితర గీతాలను ఆలపించారు. దేవస్థాన కమిటీ సభ్యులు చెరుకూరి కృష్ణకుమార్, అధ్యక్షుడు కంచర్ల రాంబాబు, కోశాధికారి నాగమోతు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

ప్రతి గడపకూ సంక్షేమం అందించిన సీఎం జగన్



గన్నవరం రూరల్ : సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి చెందుతుందని మండల పార్టీ అధ్యక్షుడు పడమట సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి ముస్తాబాద గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్‌లు, గృహ సారథులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలన్నారు. పార్టీ రహితంగా, కుల, మత, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన ఏకైక నాయకుడు సీఎం అన్నారు. సర్పంచ్ రాధాకృష్ణ, జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, జడ్పీ కో ఆ ప్షన్ సభ్యుడు గౌసాని, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, నాయకులు ఆర్‌వీఆర్, మేచినేని బాబు, జ లసూత్రం రామ్మోహన్, నాగనబోయిన గిరీష్‌రాజ్, బీవీ నరసింహారెడ్డి, కైలే ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో పురోగతి

- తాడిగడప మున్సిపాలిటీలో 84 శాతం పన్నులు వసూళ్లు
- ఒకే సారి పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేటు
- పన్నుల బకాయి రూ.3.99 కోట్లు



తాడిగడప మున్సిపాలిటీ

మున్సిపాలిటీలో మొత్తం ఇళ్లు	41,562
పన్నులు గత బకాయి	రూ.13,27,29,650. కోట్లు (2021-2022)
పన్నులు ప్రస్తుత బకాయి	రూ.12,78,21,927.కోట్లు (2022-2023)
మొత్తం పన్నుల బకాయి	రూ.26,05,51,577.కోట్లు
వసూళ్లు చేసిన పన్నులు	రూ.22,06,39,000.కోట్లు
ఇంకా వసూళ్లు చేయాల్సిన పన్నులు	రూ.3,99,12,577. కోట్లు

పెనమలూరు: పన్నుల వసూళ్లలో తాడిగడప మునిసిపాలిటీ పురోగతి సాధించింది. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ఈ ఏడాది 84 శాతం మేరకు పన్నులు వసూలు చేశారు. 2020 లో తాడిగడప మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. అయితే సిబ్బంది కొరత కారణంగా ఇంటి పన్నులు విధించి, డిమాండ్లు జారీ చేయటంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. దీని కారణంగా ఇంటి పన్నులు రూ.కోట్లలో బకాయిలు పేరుకున్నాయి. ఇంటి యజమానులు పన్నులు చెల్లించాలని ముందుకు వచ్చినా సరైన సమాచారం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. డిమాండ్లు ఆలస్యంగా ఇచ్చి వాటి పై అపరాధ రుసుం వేయటంతో ప్రజల్లో అభ్యంతరాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం స్పందించి ఆలస్యంగా ఇచ్చిన ఇంటి పన్ను డిమాండ్ల పై అపరాధ రుసుం రద్దు చేసింది. దీంతో భవన యజమానులకు ఉపశమనం లభించింది. ఇంటి పన్నుల విషయంపై ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక దృష్టి సారించారు. మునిసిపాలిటీ అధికారులతో పలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పన్నులు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో సిబ్బందిని పెంచటం, వార్డు సచివాలయాల పని తీరు మెరుగు పడటంతో ఇంటి పన్నుల విధించి డిమాండ్లు జారీ చేశారు. దీంతో భవన యజమానులు ముందుకు వచ్చి ఇంటి పన్నులు చెల్లించారు. మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఒకేసారి పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేటు..

ఈ ఏడాది 2023 ఏప్రిల్ నుంచి 2024 సంవత్సరం మార్చి వరకు చెల్లించాల్సిన ఇంటి పన్నులు ఈ ఏప్రిల్ నెలలో ఒకే సారి చెల్లించితే 5 శాతం పన్నులో రాయితీ (రిబేట్)ఉంటుంది. ఇక ఈ ఏడాది మొదటి అర్ధ సంవత్సరం పన్ను అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌కు చెల్లించాల్సిన పన్ను జూన్ 30వ తేదీ లోపు చెల్లించితే 2 శాతం వడ్డీ పడదు. అదే విధంగా రెండవ అర్ధ సంవత్సరం అక్టోబర్ 2023 నుంచి మార్చి 2024 వరకు చెల్లించాల్సిన పన్ను నవంబర్ 30 లోపు చెల్లించితే 2 శాతం వడ్డీ పడదు. ఆ తరువాత చెల్లించే పన్నులకు వడ్డీ పడుతుంది.

డిమాండ్ అందక పోయినా పన్నులు చెల్లించండి...

ఈ ఏడాది ఇంటి పన్నుల డిమాండ్‌లు ఈ నెలలో మున్సిపాలటీ భవన యజమానులకు జారీ చేస్తుంది. ఒక వేళ డిమాండ్‌లు అందని భవన యజమానులు వారి ఇంటి అసెస్‌మెంట్ నెంబర్‌తో ఇంటి పన్నులు చెల్లించితే మంచిదని మున్సిపాలటీ అధికారులు తెలుపుతున్నారు. ఇంటి పన్నుల డిమాండ్ కావల్సిన వారు ఆయా సచివాలయాల్లో సంప్రదించాలని సూచిస్తున్నారు.

కొత్త ఇళ్లకు పన్నులు

కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారికి ఇంటి పన్నులు వేయటానికి మున్సిపాలిటీ రంగం సిద్ధం చేసింది. భవన యజమాని ఇంటి ప్లాన్, డాక్యుమెంట్, లింక్ డాక్యుమెంట్, ఈసీ, ఆధార్, నోటరీ చేయించి ఆయా సచివాలయాల పరిధిలో ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ఆస్థి ఆధారితంగా కొత్త ఇంటి పన్నువు వేస్తామన్నారు.

ప్రజలు సహకరించాలి



ఇంటి పన్నుల విషయంలో ప్రజలు తమ సిబ్బందితో సహకరించాలి. పన్నుల విధింపులో లోపాలు ఉంటే వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. సకాలంలో పన్నులు చెల్లించి రాయతీ పొందాలి. మున్సిపాలిటీ ప్రగతికి ప్రజల సహకారం అవసరం.

– ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

ఘనంగా మట్టల ఆదివారం



ఉయ్యూరులో ర్యాలీ చేస్తున్న విశ్వాసులు



మానుకొమ్మలతో కంకిపాడు విచారణ గురువు ఫాదర్ మువ్వల సాల్మన్‌రాజు



కానూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న భక్తులు



జ్యోతినగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఉయ్యూరు: మట్టల ఆదివారాన్ని క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని హోసన్నా ప్రార్థనా మందిరంతో పాటు పలు ప్రార్థనా మందిరాల్లో ఆదివారం మట్టల ఆదివారం నిర్వహించారు. ఈత మట్టలతో క్రీస్తును స్మరిస్తూ పురవీధుల్లో ఊరేగారు.

కంకిపాడు: మానికొమ్మల ఆదివారాన్ని క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆరోగ్య మాత చర్చిలో పవిత్రవార ప్రార్థనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మానికొమ్మలతో విశ్వాసులు పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఏసుకు జేజేలు కొడుతూ క్రీస్తును ఆరాధించారు. విచారణ గురువు ఫాదర్ మువ్వల సాల్మన్‌రాజు నేతృత్వంలో విశ్వాసులు సీహెచ్‌సీ సెంటరు నుంచి చర్చి వరకూ ప్రదర్శన చేశారు. ఫాదర్ సాల్మన్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. సహాయ గురువు ఎం.వినోద్, సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మానుకొమ్మల పండుగ

పెనమలూరు: కానూరులో ఆదివారం మానుకొమ్మల పండుగ (మట్టల పండుగ) ఘనంగా చేశారు. కార్మెల్ చర్చిఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కామయ్యతోపు ఆర్‌సీఎం చర్చి నుంచి కార్మెల్ పుణ్యక్షేత్రం వరకు హోస న్న భక్తి గీతాలతో పాదయాత్ర నిర్వహించారు. క్రైస్తవులకు పెద్ద పండుగ అయిన ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారం మానుకొమ్మల ఆదివారంగా క్రైస్తవులు చేసుకుంటారు. ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించారు. కామయ్యతోపు, పోరంకి, గంగూరు గ్రామాలలో ఫాదర్ రాయప్ప, ఫాదర్ పృధ్వీ దివ్య బలి పూజలు, ప్రార్థనలు చేశారు. విశ్వాసకులకు ఫాదర్ బాలస్వామి దివ్యప్రసాదాం అందచేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం ఎంతో పవిత్రమైన రోజుగా బైబిల్‌లో పేర్కొనబడిందని ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో క్రైస్తవులు మట్టలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ రాజేష్, ఫాదర్ లుకాస్, జేఎంజే సిస్టర్స్ పాల్గొన్నారు. బండారుగూడెంలోని సీఎస్ఐ చర్చిలోనూ మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కిషోర్ ఆధ్వర్యంలో సంఘస్తులు క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు, యువత పూలతో అలంకరించిన మట్టలను చేతపట్టి వీధుల్లో తిరుగుతూ దావీదు తనయా జయం, హోసన్న జయం అంటూ నినాదాలు చేశారు. పెద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ పాదర్ సుధాకర్ లారెన్స్, తేలప్రోలు మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో పాస్టర్ టి.ప్రభుదాస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉంగుటూరు, ఆత్కూరు, ఇందుపల్లి, మానికొండ తదితర గ్రామాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ, వాకర్స్

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు క్రీడా సంస్థలు ముందుకురావాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు, రజిత పతకాలు సాధించిన బాలబాలికలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..గన్నవరం ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం బాలబాలికలు క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన వెంకట్రావును ప్రత్యేకంగా అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి చిప్పాడు చంద్రశేఖర్‌రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు వాకర్స్ ప్రముఖులు ముక్కామల సుబ్బారావు, చిల్లపల్లి శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గన్నవరం: మండలంలో సోమవారం నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు మొత్తం 1,380 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకానున్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో 290, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 230, దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 220, స్థానిక లిటిల్ లైట్స్ స్కూల్‌లో 150, ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో 150, వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 170, గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 170 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, వైద్య సదుపాయలను కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ భద్రతను కూడా కల్పించినట్లు తెలిపారు.

అట్టహాసంగా లయన్స్ క్లబ్ నామినేషన్‌లు



కానూరులో నామినేషన్‌లు వేసిన లయన్స్ సభ్యులు

పెనమలూరు: లయన్స్ క్లబ్ 2023-2024 సంవత్సరానికి కృష్ణా జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ ఎన్నికల నామినేషన్లు కానూరులో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరరావు వివరాలు తెలిపారు. ప్రతి సంవత్సరం మేనెలలో డిస్ట్రిక్ట్ 2వ గవర్నర్‌కు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా కానూరు అన్నే కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. జిల్లాలో 100 క్లబ్‌లు ఉన్నాయని, నాలుగు వేల మంది సభ్యులు ఓటర్లుగా ఉంటారన్నారు. రెండు సంవత్సరాలు వైస్‌గవర్నర్‌గా పని చేసిన తరువాత గవర్నర్ అవుతారన్నారు. కాగా గత 20 సంవత్సరాలుగా ఉన్నత సేవలు అందించిన ఆంజనేయులిని సభ్యులు గెలిపించితే సేవకు పట్టం కట్టినట్లే అని అన్నారు. తనను గెలిపించితే భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని ఆంజనేయులు తెలిపారు.

రేపటి నుంచి అరుణాచలానికి బస్ సర్వీస్

గన్నవరం: రుణాచలం గిరిప్రదక్షిణ యాత్ర నిమిత్తం ఈ నెల 4వ తేదీన గన్నవరం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ మంగళవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక బస్టాండ్ నుంచి బయలుదేరుతుందన్నారు. 5వ తేదీ ఉదయం శ్రీకాళహస్తిలో దర్శనం, మధ్యాహ్నం కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, భోజనం, సాయంత్రం శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్ దర్శన, అనంతరం రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 6వ తేదీ పౌర్ణమి రోజు ఉదయం గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం అనంతరం బయలుదేరి 7వ తేదీ ఉదయం 8 గంటలకు గన్నవరం చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర రూ. 2,700గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

కేంద్ర విధానాలే కారణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): నేటి ఆర్థిక సంక్షోభాలకు కేంద్రం విధానాలే కారణమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు విమర్శించారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూటీఎఫ్ 48వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రెండో రోజు జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక్క శాతం ఉన్న వారి సంపద 1/3 వంతుగా, 99శాతం ఉన్న ప్రజల సంపద 2/3గా ఉందని, దీనికి కారణం కేంద్ర పాలకుల లక్ష్యం లేని తనమని విమర్శించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు:భార్య అదృశ్యమయిందని భర్త ఫిర్యా దు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమో దు చేశారు. గోసాల సాయిబాబా కాలువ కట్ట పై భార్యాభర్తలు పంటపల్లి గోవిందు, కుమారి, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. భర్త గోవిందు పెనమలూరులో పలావు హోటల్‌లో వంటమేస్త్రిగా పని చేస్తాడు. అయితే గత రెండు రోజుల క్రితం భార్య కుమారికి విజయనగరం నుంచి ఫోన్ వచ్చింది. ఆమె సోదరి ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చేరిందని బంధువులు తెలిపారు. కాగా ఈ నెల ఒకటో తేదీన గోవిందు పని ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి భార్య ఇంట్లో కనిపించలేదు. విజయనగరం ఫోన్ చేస్తే అక్కడకు రాలేదన్నారు. దీంతో భార్య కనిపించటంలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మధురం.. 'చిలక'ఫలం

మావిచిగురుచాటున మామిడి కాయలను చూసిన ఓ చక్కని చిలక పలుకులతో ఆ చెట్టుపై వాలిన చిత్రాలను చూడండి. పటమటలో ఓ ఇంటి సమీపంలోని మామిడి చెట్టుపై మామిడి కాయలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటిలో కొన్ని కాయలు పండటంతో అక్కడకు చేరిన చిలక మధురఫలాలను కొరికిన దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వచ్చాను



వాలాను



కొరికాను



వెళ్తున్నాను

మహనీయుల సంగీత సేవలు ఆదర్శం



వయొలిన్ కచేరి నిర్వహిస్తున్న ద్వారం దుర్గాప్రసాద్ వాద్య సహకారం అందిస్తున్న బీవీఎస్ ప్రసాద్, హనుమంతరావు

విజయవాడ కల్చరల్: మహనీయుల సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావు అన్నారు. స్వరఝరి సంగీత సంస్థ మూడు రోజులుగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న 35 వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. వయొలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి రాజ్యలక్ష్మి పురస్కారం, దుర్గాప్రసాద్ సప్తతంత్రీ వాయులీన కచేరీ నిర్వహించారు. సుమతీ రామ్మోనరావు మాట్లాడుతూ ద్వారం వెంకస్వామి నాయుడు సంగీత వారసత్వాన్ని కాపాడుతూ నిజమైన కళాకారుడుగా సంగీత సరస్వతికి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సత్కార కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్‌తోపాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. దుర్గాప్రసాద్ నిర్వహించిన వాయిలీన కచేరీలో పలు సంప్రదాయ కీర్తనలు చోటుచేసుకున్నాయి. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, ఎస్ హనుమంతరావు ఘటంపై సహకరించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ఉయ్యూరు: కోడిపందేల శిబిరంపై ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ ఎంఏ ఖదీ ర్ తెలిపిన కథనం మేరకు... పట్టణ శివారు ఎగినపాడు ఖాళీ స్థలాల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్ఈబీ బృందం ఆ ప్రాంతంపై దాడి చేసింది. దాడిలో ఇద్దరు పందెంరాయుళ్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రెండు పందెంపుంజులు, మూడు ఫోన్‌లు, రూ 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి సనత్‌నగర్‌లో నాలుగు రోజులక్రితం కుక్కదాడిలో గాయపడి న బాలుడి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. సనత్‌నగర్‌కు చెందిన షేక్.అప్సర్ కుమారుడు ఆసీఫ్(2)పై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఎమ్మెల్యే పార్థసారథి సూచనతో వైఎస్సార్‌సీపీ నేతల, జిల్లా బీసీ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లభనేని మణికంఠ బాలుడి తల్లితండ్రులకు రూ. ఐదువేలు ఆర్థిక సాయం అందించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరారు. నేతలు వల్లభనేని దుర్గాప్రసాద్, చెన్ను శ్రీను, నానివర్మ, హరి,రామాలయ మిత్రబృందం పాల్గొన్నారు.